క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.గంగవరం: మండలంలోని పామర్రు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం పాడైపోయిన ఎర్త్ మాట్ మార్పుటకు విద్యుత్ సరఫరా మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు నిలిపివేయడం జరుగుతుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పామర్రు, అముజూరు, పాణింగపల్లి, కూళ్ల, నరజాడ, యండండి గ్రామాలతో పాటు కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి, మాచర, వాకతిప్ప, నాగుల చెరువు గ్రామాలకు విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబానికి సాయం



అంగరలో బాధితురాలికి సాయం అందిస్తున్న డీటీ వెంకటేశ్వరరావు

కపిలేశ్వరపురం: డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు అంగరలోని అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం అందించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన మేడిది సత్యవతి, మేడిది దుర్గాభవానిలకు చెందిన ఇల్లు కాలిపోయింది. విషయం తెలుసుకున్న డీటీ వెంకటేశ్వరరావు శుక్రవారం బాధితులకు బియ్యం, దుస్తులు, కూరగాయలు, కిరణా సరుకులు అందజేశారు. ఆయనను రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, గ్రామ ప్రముఖులు మత్సా గంగరాజు, పిల్లా బసవరాజు, సుంకర కృష్ణ తదితరులు అభినందించారు.

బాధితునికి ఎన్ఆర్ఐ ఆపన్నహస్తం



బాధితునికి సాయం సొమ్మును అందిస్తున్న పెంకే గోవిందరావు సీతారత్నం దంపతులు

మండపేట: ఆలమూరు మండలం నర్సిపూడికి చెందిన ఓ బాధిత కుటుంబానికి మండపేటకు చెందిన ఎన్ఆర్ఐ గుత్తుల ఫణి కిషోర్ ఆపన్న హస్తం అందించారు. సోషల్ మీడియా ద్వారా వైరల్ అయిన పోస్టుకు స్పందించి ఆయన ఈ సాయం అందించారు. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల విద్యుత్ షాక్‌కు గురైన నర్సిపూడికి చెందిన కొప్పిరెడ్డి దుర్గాప్రసాద్ ఎడమ చేతి భాగాన్ని తొలగించాల్సి వచ్చింది. దీంతో దుర్గాప్రసాద్ కొంత కాలంగా ఇంటి వద్దే చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనను ఆ గ్రామస్తులు ఫేస్‌బుక్‌లో పోస్టు చేయడంతో అమెరికాలో ఉంటున్న ఎన్ఆర్ఐ ఫణికిషోర్ సెల్‌లో ప్రత్యక్షం కావడంతో వెంటనే స్పందించారు. తన వంతు సాయంగా దుర్గాప్రసాద్‌కు రూ.10 వేలు పంపారు. ఈ మొత్తాన్ని ఆయన బంధువులు పెంకే గోవిందరావు, సీతారత్నం దంపతుల ద్వారా బాధితునికి అందించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

రాయవరం: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని ధ్యాన మాస్టర్ సీతాకుమారి, పిరమిడ్ మాస్టర్ రాజ్యలక్ష్మి, యోగా గురువు వెలగల ఫణి కృష్ణారెడ్డి అన్నారు. రాయవరంలోని సత్యసాయి బాబా సేవా మందిరం వద్ద నిర్మించిన వెలగల వెంకటరెడ్డి పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద శుక్రవారం ఉచిత ధ్యాన శిక్షణ, ఆత్మ జ్ఞానంపై 15వ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఫణికృష్ణారెడ్డి, సీతాకుమారి, రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన ప్రస్తుత దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ధ్యానానికి కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. ధ్యానం ద్వారా ఎన్నో వ్యాధులను, మానసిక రుగ్మతల నుంచి దూరం కావచ్చునన్నారు. మండలంలోని మాచవరం, సోమేశ్వరం, రాయవరం, పులుగుర్త, కొమరిపాలెం, కొంకుదురు మామిడాడ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ధ్యాన తరగతులకు ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో జి.కాశీ విశ్వనాథ్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు ఫణికృష్ణారెడ్డి, సీతాదేవి దంపతులు ధ్యాన శిక్షకులు సీతాకుమారిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఎమ్మెల్యే వేగుళ్లను కలసిన సచివాలయ ఉద్యోగులు

మండపేట: సచివాలయ యూనియన్ మండపేట మండల సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. యూనియన్ అధ్యక్షుడు ఎస్. దొరబాబు నేతృత్వంలో ఉపాధ్యక్షురాలు బి.పద్మప్రియతో పాటు సభ్యులు వేగుళ్లను దుశ్శాలువాతో సత్కరించి గిఫ్ట్ ప్లాంట్ బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని, అందుకు సచివాలయ ఉద్యోగులు సహకారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కె.దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శులు మహమ్మద్ సులేమాన్, మంగాదేవి, కోశాధికారి సయ్యద్ హమీద్, సభ్యులు ఏ శ్రీనివాస్, టి. రత్నరాహుల్, ఎం.మణికంఠ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

కానరాని ముందస్తు ప్రణాళిక

- ముంచుకొస్తున్న వరదల సమయం
- ధవళేశ్వరంలో 28,283 క్యూసెక్కుల నీరు విడుదల
- నెలాఖరు నాటికి మరింత పెరిగే అవకాశం
- ఫ్లడ్ స్టోర్‌లను సిద్ధం చేసిన గత ప్రభుత్వం
- ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నెల కావొస్తున్నా చర్యలు నిల్



కేదారిలంకలో ముంపుబారిన లంక గ్రామం (ఫైల్)



2023 జూలైలో కేదారిలంకలో వరద పరిస్థితులను పరిశీలిస్తున్న అప్పటి ఆర్డీఓ సింధు సుబ్రహ్మణ్యం (ఫైల్)

కపిలేశ్వరపురం: జూలై, ఆగస్టు నెలలు అనగానే వరద భయం ముందుకొస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు గోదావరిలో నీటిమట్టం స్వల్పంగా పెరిగింది. దీంతో ధవళేశ్వరంలో 28,283 క్యూసెక్కుల మిగులు జలాలను విడుదల చేశారు. ప్రస్తుతానికి అంత ప్రమాదం కాకపోయినా సహజంగానే జూలై నెలాఖరునాటికి వరదల ప్రభావం తీవ్రమవుతుందన్నది గత అనుభవం. ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగేలోపే ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలి. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల కావస్తున్నా క్షేత్ర స్థాయిలో వరదలపై సరైన ఆదేశాలు ఇవ్వని పరిస్థితి నెలకొంది. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పాలనలో జూన్‌లో ఫ్లడ్‌స్టోర్‌ల నిర్వహణపై క్షేత్ర స్థాయిలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. మిగులు జలాలు విడుదల చేయడంతో లంక గ్రామాల ప్రజల్లో అలజడి మొదలైంది.

రెండు నియోజకవర్గాల్లో వరద ప్రభావం ఇలా...

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని పలు లంక గ్రామాలు పూర్తిగా గోదావరి నదిలో ఉన్నాయి. కపిలేశ్వరపురం మండలంలో అద్దంకివారిలంక, కేదారిలంక, కె.గంగవరం మండలంలో శేరిలంక మొత్తం మూడు గ్రామాలు ఏటా వరద ప్రభావానికి గురవుతాయి. అద్దంకివారిలంక గ్రామ పరిధిలో పల్లపులంక, అద్దంకివారిలంక, కోరుమిల్లి లంక, కేదారిలంక గ్రామ శివారులో వీధివారిలంక, కేదారిలంక, కపిలేశ్వరపురం గ్రామ పరిధిలో నారాయణలంకలు వరదల సమయంలో పెద్ద ఎత్తున నష్టపోతుంటాయి. ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగానే ఆయా గ్రామాల పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలకు వరదనీరు తాకుతుంది. రెండో ప్రమాద హెచ్చరిక రాగానే వ్యవసాయ క్షేత్రాలు మొత్తం ముంపుబారిన పడతాయి. పశువులను గ్రామాలకు తరలించుకుంటారు. మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన పరిస్థితుల్లో గ్రామాల్లోని నివాసిత ప్రాంతమంతా వరదనీటిలో తేలుతుంటాయి.

గత అనుభవాలిలా...

2014, 2016, 2018, 2019, 2020, 2022, 2023లలో వరుసగా వరదలకు లంక గ్రామాలు ముంపుబారిన పడుతూ వచ్చాయి. 2018 ఆగస్టు వరదలకు కపిలేశ్వరపురం, నారాయణలంక, కేదారిలంక, వీధివారిలంక గ్రామాల పరిధిలో 126.93 హెక్టార్లు, తాతపూడిలో 27.94 హెక్టార్లు, కోరుమిల్లి, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల పరిధిలో 54.72 హెక్టార్లు, మండలం మొత్తంలో 646 మంది రైతులకు చెందిన 209.59 హెక్టార్లలోని అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రూ.36,53,650 నష్టం వాటిల్లింది. 2019 ఆగస్టులో లంకల్లోని వ్యవసాయ క్షేత్రాలు, ఇటుక బట్టీలన్నీ ముంపుబారిన పడ్డాయి. తొగరపాట వంతెన మునగడంతో ఇతర గ్రామాలతో రాకపోకలు తెగిపోయాయి. వీరవల్లి పాలెం రహదారి మునిగిపోవడంతో ఆర్టీసీ, ప్రైవేటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరికి ఎడమ భాగాన ఉన్న తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, శ్రీరాంపురం, వాకతిప్ప గ్రామాల పరిధిలోని ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 2023 జూలై వరదల సమయంలో వ్యవసాయ క్షేత్రాలు ముంపుబారిన పడగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాడి పశువులకు దాణాను సరఫరా చేసింది. పశు సంవర్ధక శాఖాధికారులను లంక గ్రామాల్లోనే ఉండేలా ఆదేశాలిచ్చి సేవలందించింది.

విశేషంగా సేవలందించిన వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నెలకొల్పిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలు వరదల సమయంలో విశేషంగా ఉపకరించాయి. 2022, 23లలో సంభవించిన వరదల్లో సచివాలయ ఉద్యోగులు లంక గ్రామాల్లోనే ఉంటూ బాధితులకు సేవలందించారు. రాత్రింబవళ్లు గోదావరి గట్లను పరిశీలిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలిచ్చేవారు. బాధిత ఇళ్లకు ఆహార పదార్థాలను, కూరగాయలను పడవలపై తీసుకెళ్లి ఇచ్చేవారు. వలంటీర్లు ఇంటింటికీ వాటర్ కేన్లను అందజేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం తీరు గత ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవస్థలను కించపరిచేదిగా ఉంటుంది. క్షేత్ర స్థాయిలో ప్రజల ప్రయోజనాలను పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నేడు రామచంద్రపురం మండల సమావేశం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం నేటి మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎన్వీ రామచంద్రమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎక్స్ అఫీషియో హోదాలో తొలిసారిగా హాజరవుతున్నారని తెలిపారు. జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, అందరు మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

కలెక్టర్‌ను కలసిన చైర్‌పర్సన్ దుర్గారాణి



కలెక్టర్‌కు జ్ఞాపిక అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రావిరాల మహేష్‌కుమార్‌ను మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్‌పర్సన్ దుర్గారాణి అమలాపురం వెళ్లి కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలసి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించి శుభాకాంక్షలు తెలిపారు. చైర్‌పర్సన్ వెంట 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ కూడా ఉన్నారు.

చురుగ్గా జంగిల్ క్లియరెన్స్ పనులు



జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రాము

మండపేట: రెండు వారాలుగా స్థానిక గొల్లపుంత రోడ్డు టిడ్కో కాలనీలో జంగిల్ క్లియరెన్స్ పనులు వేగంగా జరుగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఈ కాలనీపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. వర్షాకాలం మొదలవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున్న కాలనీ అంతా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు,గడ్డిని కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఇక్కడ జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను శుక్రవారం కమిషనర్ పరిశీలించారు. కాలనీలోని ఏ ప్రాంతంలోనూ వ్యర్థాలు గానీ, గడ్డి, పిచ్చి పొదులు వంటివి ఉండరాదని మొత్తం తొలగించాలని సిబ్బందికి మరోమారు గుర్తు చేశారు.

తాగునీటి నాణ్యత లోపిస్తే చర్యలు



కోరుమిల్లిలో వాటర్ ట్యాంక్ నిర్వహణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కొండలరావు

కపిలేశ్వరపురం: గ్రామాల్లో సరఫరా చేసే తాగునీటిలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ కొండలరావు పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల నిర్వహణ తీరును స్వయంగా పరిశీలించి కార్యదర్శులకు సూచనలు చేశారు. నిర్దేశించిన ప్రమాణాల్లో క్లోరినైజేషన్ చేయాలని ఆదేశించారు. అంగర, పడమర ఖండ్రిక, కోరుమిల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు.

భావితరాలకు ఆదర్శం కావాలి



ఉద్యోగ విరమణ చేసిన సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది, స్థానిక నాయకులు

కాజులూరు: విశ్రాంత ఉద్యోగుల ఆశయాలు, అనుభవాలు భావితరం ఉద్యోగులకు ఆదర్శం కావాలని రిటైర్డ్ డీవైఈఓ సీహెచ్ ధర్మరాజు అన్నారు. గత కొన్నాళ్లుగా కాజులూరు జెడ్పీ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సీఎన్‌వీవీ సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేశారు. శుక్రవారం పాఠశాలలో హెచ్ఎం పంపన కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ దంపతులకు ఘనసన్మానం ఏర్పాటు చేశారు. ఎంఈఓ పి.జాన్, రిటైర్డ్ డీవైఈఓ సీహెచ్ ధర్మరాజు, స్టాఫ్ సెక్రటరీ హరినాథ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాధాకృష్ణ, స్థానిక నాయకులు బుద్దాల చంటి బాబు, పాఠశాల సిబ్బంది సత్యనారాయణ దంపతులను సత్కరించారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థం



మహాలక్ష్మి అమ్మవారి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

రాయవరం: స్థానికంగా కొలువైన మహాలక్ష్మీ అమ్మవారి తీర్థాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శతాబ్దాల చరిత్ర ఉన్న అమ్మవారికి ఆషాఢ మాసం ముందుగా జాతర నిర్వహించి మరుసటి రోజు తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, కరెన్సీ నోట్లతో అలంకరించారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం ప్రారంభించారు. తమ పసుపు కుంకాలను, పిల్లలను, పాడిపంటలను చల్లగా చూడాలని కోరుతూ మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. గురువారం రాత్రి అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఉత్సవ కమిటీ నేతలు పులగం శ్రీనివాసరెడ్డి (పీఎస్ఆర్), సత్తి వెంకటసుబ్బారెడ్డి, సత్తి వెంకటరెడ్డి, కర్రి గోపాలకృష్ణారెడ్డి, పులగం భీమేశ్వర రెడ్డి, నల్లమిల్లి రామారెడ్డి, మందులపాపు శ్రీను, తాడి వెంకట రామకృష్ణారెడ్డి, మల్లిడి వీర్రాఘవరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి



శలపాకలో చిన్నారులతో చేతులు కడిగిస్తూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కాజులూరు: సీజనల్ వ్యాధులపై చిన్నారులకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్.మాణిక్యాంబ అన్నారు. శుక్రవారం శలపాక, తణుకువాడ తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సీజనల్ వ్యాధులపై సిబ్బంది, చిన్నారులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చెదురుమదురు వర్షాల కారణంగా గ్రామాలలో అపారిశుధ్యం తలెత్తి డయేరియా, టైఫాయిడ్, మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులు సక్రమించే అవకాశం ఉందన్నారు. చిన్నారులు ఎప్పటికప్పుడు వ్యాధులు సక్రమించకుండా చేతులు శుభ్రంగా కడుగుతుండాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఏర్పాటు



ద్రాక్షారామలో నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సంఘ నాయకులు, సభ్యులు

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండలంలోని ద్రాక్షారామలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఉత్తర కోస్తా జిల్లా ఇంచార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబులు ముఖ్య అతిథులుగా పాల్గొన్ని ఎన్నిక నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా సిర్రా సురేష్, కాజులూరు మండలం కన్వీనర్లుగా ఖండవల్లి శ్రీనివాసరావు, పలివెల రాజు, కె.గంగవరం కన్వీనర్లుగా మోర్త దొరబాబు, మందపల్లి ప్రకాశ్, పెందుర్తి కుమార్‌లను ఎంపిక చేశారు. చినసుబ్బారావు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు విద్యావంతులైన యువతీ, యువకులు సంఘ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మూడు మండలాల ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏడిద జెడ్పీ హైస్కూల్‌కు రూ.16 లక్షల విరాళం



ప్రయోగశాలను పరిశీలిస్తున్న విద్యాదాత పురుషోత్తమరావు దంపతులు



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న పురుషోత్తమరావు

మండపేట: మండలంలోని ఏడిద జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ప్రయోగ శాఖ ఏర్పాటుకు హైదరాబాద్‌లో స్థిరపడిన ఏడిద గ్రామానికే చెందిన పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తమరావు, అనంతలక్ష్మీ కుమారి దంపతులు రూ.16 లక్షలు గురువారం విరాళంగా అందజేశారు. గ్రామంలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమాన్ని శుక్రవారం అదే పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఇంటర్ ఫస్టియర్‌లో ప్రథమ స్థానం పొందిన ఏడిద గ్రామానికి చెందిన బండారు లక్ష్మీ దుర్గకు రూ.5 లక్షలు, పదో తరగతిలో ప్రథమ స్థానం పొందిన మల్లేశ్వరపు శిరీషకు రూ.రెండు లక్షల నగదు పురస్కారాలను పురుషోత్తమరావు దంపతులు అందజేశారు. కాగా ఇదే ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం కొత్తగా జూనియర్ కళాశాలను ప్రారంభించింది. ఇంటర్ విద్యార్థులకు భౌతిక, రసాయన, వృక్ష శాస్త్రాల ప్రయోగశాలల ఏర్పాటుకు ఈ రూ. 16 లక్షల విరాళాన్ని దాత దంపతులు వేదికపై అందించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు ముంగర వెంకట్రాజు అధ్యక్షత వహించారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, మాజీ సర్పంచ్ యరపోతిన చంటి, మేకా జేజిబాబు, పర్వతిన వీర్రాజు, చిట్టూరి ప్రసాద్ , రామిశెట్టి శ్రీహరి, పర్వతిన వీర్రాజు, చిట్టూరి ప్రసాద్, రామిశెట్టి శ్రీహరి, రామిశెట్టి రాజా, బలుసు వెంకట్రావు, గొడవర్తి సత్యనారాయణ (ఎర్రబ్బు), వట్టికూటి వీరవెంకట సత్యనారాయణ చౌదరి (పూసయ్య), చిలుకూరి బుజ్జి పాల్గొన్నారు.

వరదలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అయినవిల్లి: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు అధికంగా కురుస్తున్న కారణంగా ఏ క్షణానైనా గోదావరి వరదలు వచ్చే ప్రమాదం పొంచి ఉందన్నారు. రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన అయినవిల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రమద్వర నేతృత్వంలో వీఆర్వోలతో సమీక్షించారు. ప్రస్తుతం వరదల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే తొలకరి సాగుకు రైతుల సన్నద్ధం అవుతున్న సందర్భంలో కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు వెంటనే మంజూరు చేయాలని ఆదేశించారు. అలాగే మండలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక నిల్వలు వంటి వాటిపై ఆరా తీశారు. అలాగే 400 కేవీ విద్యుత్ లైన్‌కు కోసం సేకరించిన భూముల కోసం ఆరా తీశారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: వరదల సీజన్ రానున్న నేపథ్యంలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మండలంలోని వీఆర్వోలు, వీఆర్ఏలు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వరదల వల్ల ఏఏ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది, అక్కడ చేపట్టాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. అలాగే రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై వీఆర్వోలు, వీఆర్ఓలకు సూచనలిచ్చారు. సమావేశంలో తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి, డీటీ డి.శ్రీనివాస్, ఆర్ఐ పి.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు ఛిద్రం

- అధికారుల ఉదాసీనత
- నిబంధనలు బేఖాతర్



సూర్యారావుపేటలో దమ్ము చక్రాలతో ట్రాక్టర్



పెనికేరులో దమ్ము ట్రాక్టర్ల వల్ల తీవ్రంగా దెబ్బతిన్న రోడ్డు

ఆలమూరు: దమ్ము ట్రాక్టర్లు నిబంధనలను సక్రమంగా పాటించకపోవడంతో రూ.కోట్లతో నిర్మిస్తున్న గ్రామీణ రహదారులను ఛిద్రం చేస్తున్నాయి. దీనివల్ల పుంత రోడ్లతో పాటు తారు రోడ్లు, సిమెంట్ రోడ్లు కూడా అనతికాలంలోనే తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఏళ్ల తరబడి మన్నికగా ఉండవలసిన రోడ్లు కొద్ది నెలలకే గోతులు పడి శిథిలస్థితికి చేరుకుంటున్నాయి. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు రోజు రోజుకు దిగజారుతున్న ఈ తరుణంలో బద్దె లేకుండా దమ్ము చక్రాలతో నడవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంది. ఫలితంగా కోట్లాది రూపాయల నిధులు వృథాగా పోతున్నాయి. దమ్ము ట్రాక్టర్ల ప్రవేశానికి కనీస నిబంధనలు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో దమ్ము చక్రాలు బిగించిన ట్రాక్టర్లు రోడ్లపై స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ఇటీవల నిర్మించిన రహదారులు బీటలు వారి పోయి అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. దీనివల్ల వర్షపు నీరు గోతుల్లో ఉండి తక్కువ సమయంలోనే మరమ్మతులకు చేరుకుంటున్నాయి. క్లస్టర్ పరిధిలోని రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లో సాగు చేస్తున్న సుమారు 28 వేల ఎకరాలకు సంబంధించి దాదాపు రెండు వేల ట్రాక్టర్ల వరకూ దుక్కు దున్నే అవకాశం ఉంది. అయితే అందులో దాదాపు సుమారు 40 శాతం మంది ట్రాక్టర్ యజమానులు బద్దెలు అమర్చడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు చూసి చూడనట్లు వదిలి వేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వేళ అధికారులు దమ్ము చక్రాల ట్రాక్టర్‌ను సీజ్ చేసినా పాలకుల ఒత్తిడితో సత్వరమే బయటకు వస్తున్నాయి. దీనివల్ల కూడా అధికారులు పట్టించుకోకపోవడానికి కారణంగా తెలుస్తోంది. అయితే ఇటీవల కొన్ని గ్రామాల్లో చిన్న ట్రాక్టర్లు ఎక్కువగా దమ్ము చేయడం కొంత మేర ఊరటనిస్తుంది.

యజమానులు నిబంధనలు పాటించాల్సిందే

ప్రభుత్వం విధించిన నిబంధనలను ట్రాక్టర్ యజమానులు సక్రమంగా పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడుతుందని స్థానికుల నుంచి ఆవేదన వ్యక్తమవుతుంది. వాహనదారుడు పొలాల్లో దుక్కు దున్ని వెళుతున్నప్పుడు కచ్చితంగా చక్రాలకు ఇనుపబద్దెను అమర్చుకోవాలి. లేకుంటే పొలంలోకి టైర్లతోనే వెళ్లి అక్కడే దమ్ము చక్రాలను బిగించుకోవాలి. అనంతరం మరో పొలంలో వెళ్లాలనుకుంటే మళ్లీ టైర్లు మార్చుకుని ప్రవేశించాలి. దమ్ము పూర్తయిన అనంతర మళ్లీ టైర్లు బిగించుకుని గమ్య స్థానానికి చేరుకోవాలి. కనీస భద్రతా చర్యలు పాటించని ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేస్తే మిగిలిన వారైన నిబంధనలను పాటించే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ మండలంలో రెండేళ్ల నుంచి ఒక కేసు కూడా నమోదు కాకపోవడం అధికారుల అసమర్థతను చూపిస్తుంది.

ఛిద్రమైన రోడ్లు

మండలంలో పలు రోడ్లు దమ్ము ట్రాక్టర్ల దెబ్బకు తీవ్రంగా ఛిద్రమవుతున్నాయి. ఈఏడాది నిర్మించిన కలవచర్ల-వెదురుమూడి రోడ్డు, ఆలమూరు-పెనికేరు రోడ్డుతో పాటు అనేక సీసీ రోడ్లు దమ్ము చక్రాల వల్ల తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎన్ఆర్‌జీఈఎస్‌లో నిర్మించిన గ్రావెల్‌రోడ్లు దమ్ము చక్రాల దెబ్బకు గోతులు ఏర్పడి చిత్తడిగా మారుతుంది. ఇకనైనా అధికారులు సత్వరమే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుని కోట్లాది రూపాయల విలువైన రోడ్లను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.